# మీ వెంటే ఉంటా.. ఆపదొస్తే ఆదుకుంటా



పెరక సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ

- **మరొకసారి ఆశీర్వదించండి**
- **మరింత అభివృద్ధి చేస్తా**
- **జగిత్యాలను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా**
- **జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్**
- **ఎమ్మెల్సీ ఎల్ రమణ**

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 28: ' నేను ఈ ప్రాంత బిడ్డను. మీ వెంటే ఉంటా.. కష్టాల్లో తోడుంటా. ఆపదొస్తే ఆదుకుంటా. ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా చూసుకుంటా. మళ్లీ ఆశీర్వదించండి. జగిత్యాలను మరింత అభివృద్ధి చేస్తా' అని జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని బూసి లక్ష్మీనారాయణ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన జగిత్యాల నియోజకవర్గ పురగిరి క్షత్రియ(పెరుక)ల ఆత్మీయ సమ్మేళనానికి జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 2014లో తొలిసారి ఓడిపోయినా, 2018లో ఎమ్మెల్యేగా గెలిచినా.. అప్పుడూ, ఇప్పుడూ నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ జగిత్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా అభివృద్ధిలో ముందంజలో ఉందని, ఈ విషయాన్ని మంత్రి కేటీఆరే స్వయంగా ట్విట్టర్‌లో వెల్లడించారన్నారు. గడిచిని తొమ్మిదేండ్లలో నియోజకవర్గానికి తొమ్మిది గురుకుల పాఠశాలలను తీసుకువచ్చానని, దీంతో ఎంతో మంది పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు కార్పొరేట్‌కు ధీటుగా విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలో పెరుకలకు సంఘ భవనానికి స్థలాన్ని తప్పకుండా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

**సంజయ్‌ను దీవించండి : ఎమ్మెల్సీ ఎల్. రమణ**

కామారెడ్డి అసెంబ్లీ సీటును సీఎం కేసీఆర్ కోసం గంప గోవర్దన్ త్యాగం చేయడంతో పెరుకలు త్యాగానికి ప్రతిరూపకంగా నిలిచారని ఎమ్మెల్సీ ఎల్. రమణ కొనియాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పెరుకలంతా కారు గుర్తుకు ఓటు వేసి డా. సంజయ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఇటీవలే నూతనంగా ఏర్పాటైన పెరుక సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి రాజేశం గౌడ్ కలిసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఇక్కడ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ డా. చంద్రశేఖర్‌గౌడ్, పెరుక సంఘం జిల్లా అధ్యక్షుడు బాల ముకుందం, ప్యాక్స్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, ఆర్బీఎస్ మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, పెరుక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమౌళి, ఉపాధ్యక్షులు కట్ట రాజేందర్, సర్పంచులు బొడ్డు దామోదర్, అంకతి మల్లయ్య, నల్లపు తిరుమల్, ఉప సర్పంచ్‌లు బుచ్చన్న, రమేష్, సంఘ నాయకులు మంచాల అంజి, మీస వేణుగోపాల్, మహేశ్, మంచాల శ్రీనివాస్, ధర్మరాజు, బొడ్డు గంగాధర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వస్తే పథకాలు బందే

- **అభివృద్ధి.. సంక్షేమమే మా నినాదం**
- **'చల్మెడ'ను ఆశీర్వదించండి**
- **ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్**
- **కథలాపూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం**
- **అభ్యర్థి చల్మెడతో కలిసి పలు గ్రామాల్లో ప్రచారం**



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్ చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

కథలాపూర్, అక్టోబర్ 28: 'కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏండ్ల కొద్ది పాలించి చేసిందేమీ లేదు. ఇప్పుడు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకాలు చూస్తే కండ్లుమండించుకుంటున్నది. మొన్నటికి మొన్న రైతు బంధు ఇవ్వద్దంటూ ఫిర్యాదు చేశారు. ఇంకా రైతుబంధు పేరిట అనవసరంగా బీఆర్ఎస్ ఖర్చు చేస్తుందని ఆ పార్టీ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడడం దారుణం. కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతం. పథకాలుండవు. ఈ అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలి' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ ఉద్ఘాటించారు. శనివారం కథలాపూర్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కథలాపూర్ మండలకేంద్రానికి చెందిన యాదవ సంఘం సభ్యులు బీఆర్ఎస్ అండగా ఉంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం విలేకరులతో వినోద్‌కుమార్ మాట్లాడారు. అలాగే తాండ్ర్యాల, అంబారిపేట, తుర్తి, ఇప్పపెల్లి, పోతారం, కలికోట గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయాచోట్ల వినోద్‌కుమార్ మాట్లాడారు. 'వేములవాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఆశయంతోనే చల్మెడ మీ ముందుకు వచ్చారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి. కారు గుర్తుకు ఓటేసి అసెంబ్లీకి పంపించండి' అని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి, రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిందన్నారు. రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలని, అప్పుడే మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, రాష్ట్ర బాగుంటుందని, ప్రజలు ఆలోచన చేసి ఓటు వేయాలని కోరారు. గ్రామాల్లోని యువత ఇంజినీరింగ్, ఉన్నత చదువులు చదివి బీఆర్ఎస్‌కు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం వచ్చాక గ్రామాల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అనేక మంది ఉద్యోగాలు సాధించారని, త్వరలోని మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాలకు అనేక రకాల రుణాలు అందించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని, ప్రస్తుతం మహిళ సంఘాల సహకారంతో గ్రామాల్లో అప్పుల బాధలు తప్పాయన్నారు. వ్యాపారులు, పరిశ్రమలకు అనేక రుణాలు అందించి అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇనాళ్లూ కష్టపడి సాధించుకున్న తెలంగాణ మరింత అభివృద్ధి చెంది అందరూ అభివృద్ధి వైపు ప్రయాణించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అప్పుడే మన లక్ష్యం నెరవేరుతుందన్నారు. కథలాపూర్‌లో మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ తండ్రి రషీద్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.



అంబారిపేటలో మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

**మూడేండ్లలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తా: చల్మెడ**

అందరూ ఆశీర్వదించి గెలిపిస్తే మూడేళ్లలోపు మండలంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని చల్మెడ లక్ష్మీనర్సింహారావు హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది మన బతుకులు మారాలంటే మళ్లీ ఒక సారి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెబుతున్నారని, మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా..? 24గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా..? ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. రైతుబంధు పథకాన్ని ఆపాలని కుట్ర చేస్తున్నారని, ఇది రైతుల పొట్ట కొట్టే విధానమని జాగ్రత్తగా ఉండాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు ప్రభుత్వ పథకాలు మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. ఇక్కడ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జడ్పీటీసీ నాగం భూమయ్య, జడ్పీ ఉపాధ్యక్షుడు హొద్దినేని హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఎం.జీ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బొడ్డు బాలు, నాయకులు గడ్డం భూమారెడ్డి, మామిడిపెల్లి రవి, ఏజీబీ మహేందర్, చీటి విద్యాసాగర్‌రావు, దర్మపురి జలేందర్, కోలి వసంత, దరావత్ సరోజ, గంగం దేవేంద్ర, సబ్బని గంగు, రజిత, స్వప్న, విజయక్క తదితరులు ఉన్నారు.

# ప్రతిపక్షాలవీ ఝూటా మాటలు

- **మోసపు హామీలతో మభ్యపెడుతున్నరు**
- **లక్ష ఇండ్లు ఎక్కడ కట్టించారో ఎంపీ అర్వింద్ చూపించాలి**
- **కోరుట్ల అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల**
- **కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఏం చేశాయో చెప్పి ఓట్లడగాలి**
- **కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు**

మల్లాపూర్, అక్టోబర్ 28: 'బీఆర్ఎస్‌ది అభివృద్ధి తోవ అయితే.. కాంగ్రెస్, బీజేపీలది అధికార యావ. ఎట్ల చేసైనా గెలవాని అన్నీ అబద్ధాలు చెబుతున్నరు. మోసపు హామీలతో మభ్య పెడుతున్నరు. నమ్మితే మోస పోతం జాగ్రత్త' అని కోరుట్ల అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి మల్లాపూర్ మండలం ముత్యంపేట, హుస్సేన్‌నగర్, రాఘవపేట, నడికుడ, మొగిలిపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే నాయకుడికి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ఎంపీగా గెలిచిన అర్వింద్ కోరుట్ల నియోజకవర్గంలో లక్ష ఇండ్లు కట్టించారని చెబుతున్నారని, ఆ ఇండ్లు ఎక్కడ ఉన్నాయో చూపించాలన్నారు. ఎలాంటి సంస్కారం, మర్యాద లేకుండా ఇష్టానుసారంగా సీఎం కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదని, రానున్న రోజుల్లో కోరుట్ల నియోజకవర్గ ప్రజలే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అలాంటి వ్యక్తికి బుద్ధి రావాలంటే కోరుట్ల ప్రజలు తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలిస్తున్న రాష్ట్రాల్లో ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో నిత్యం మనం చూస్తూనే ఉన్నామని, అలాంటి పాలన మనకు అవసరమా..? ఆలోచించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లకు పైగా గెలుపొందడం ఖాయమన్నారు.

**ఏం చేశారో చెప్పి ఓట్లడగాలి : ఎమ్మెల్యే కల్వకుంట్ల**

ఎన్నికల వేళ గ్రామాలకు వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఏం చేశారో చెప్పి ఓట్లను అడగాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల డిమాండ్ చేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎక్కడ ఉన్నారో ప్రజలు అడగాలన్నారు. వరుసగా తనను కోరుట్ల ప్రజలు ఆశీర్వదించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఇప్పుడు తన కొడుకు సంజయ్‌ను దీవించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామాల్లోని కాలనీల్లో తిరుగుతూ ఓటర్లకు మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఇక్కడ ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి దేవర సురేష్, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, ఆర్బీఎస్ జిల్లా డైరెక్టర్ దేవ మల్లయ్య, మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి, సర్పంచులు బొల్లం కృష్ణవేణి, సయ్యద్ హైదర్, నత్తి లావణ్య, భూక్య రుక్మ, వనతడపుల నాగరాజు, ఎంపీటీసీ ఓస సత్తమ్మ, గ్రామశాఖ అధ్యక్షులు చింతల రమేశ్, కరీం, సుద్దు రాజ్‌కుమార్, మహేశ్, జెల్ల ప్రసాద్ పాల్గొన్నారు.



ముత్యంపేటలో నిర్వహించిన రోడ్ షోలో నినాదాలు చేస్తున్న కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఆభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల, పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు